www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం శుక్రవారం 24.01.2025

అది తుది జాబితా కాదు..

## వెరిఫికేషన్ మాత్రమే

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- పథకాల లబ్ధి విషయంలో ఆందోళన వద్దు
- చివరి దరఖాస్తుదారుడికీ లబ్ధి చేకూరుస్తాం

3లో

- రాష్ట్రానికి పెట్టుబడుల వరద
- కొత్త ఒప్పందాలతో 49,500 ఉద్యోగాలు
- రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇదే అతి పెద్ద రికార్డు
- 16 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం
- గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు



# మూడు రోజులు.. 16 సంస్థలు.. రూ.1,78,950 కోట్లు

## దావోస్‌లో తెలంగాణ ధమాక

2లో

కలంజ్యోతి, హైదరాబాద్ : మూడు రోజులు.. 16 సంస్థలు.. రూ.1,78,950 కోట్లు ఇదీ దావోస్ పర్యటనలో ఉన్న తెలంగాణ రైజింగ్ బృందం సాధించిన పెట్టుబడుల లెక్క. అక్కడ నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రైజింగ్ బృందం గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి రికార్డు నమోదు చేసింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటి వరకు రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు సాధించింది.

కొండాపూర్‌లో

## పెద్దపులి కలకలం

కలంజ్యోతి, కొడిమ్యాల : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ గ్రామంలో పెద్దపులి సంచారం ప్రజలను భయపెడుతుంది. గ్రామ శివారులో రైతు గుండు బాబుకు చెందిన ఆవు తన పొలం వద్ద తీవ్రంగా గాయపడి మృతి చెందింది. గురువారం ఉదయం గమనించిన రైతు గ్రామస్తులకు, అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఫారెస్ట్ అధికారులు చేరుకొని, మొదటగా చిరుత పులిగా భావించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సిసి ఫుటేజ్ ఆధారంగా పెద్దపులిగా గుర్తించి, హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి సంచారం అని తెలియడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



WANTED విలేకరులు కావలెను




'కలంజ్యోతి' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి, నాయకులకి మధ్య సమాచార వారధిగా, ప్రజా సమస్యల పరిష్కార దిశగా, పాఠకుల దిక్సూచిగా 'కలంజ్యోతి' పాఠకుల మన్ననలను పొందుతున్నది. మరింత నాణ్యమైన వార్తా సమాచారాన్ని, వార్తా ప్రపంచాన్ని విస్తరించడానికి ప్రజలకు అందించాలనే సంకల్పంతో నియోజకవర్గ, మండలాల వారీగా కంట్రీబ్యూటర్లు నియమించుకోవాలని భావిస్తున్నాము.

సెల్ : 9494 009 003

కలంజ్యోతి

శుక్రవారం 24.01.2025



## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు
# దూరంగా ఉండాలి

### బల్దియా చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్

**కలంజ్యోతి, జగిత్యాల :**

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బల్దియా చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్ లో ఒకేషనల్ నేతాజీ జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం లో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా మంచి మార్కులు సాధించాలన్నారు. సమావేశంలో విద్యార్థులు నృత్యాలు, ఆట పాటలతో అలరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సింగం భాస్కర్, బలరామ కృష్ణ , మనాపూర్ రాజనర్సయ్య , సత్యనారాయణ రావు, బి గంగాధర్, నేతాజీ జూనియర్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## 5 గ్రామాల్లో గ్రామ సభలు..

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని మానాల, లంబాడిపల్లి, తక్కళ్ళపల్లి, మ్యాడంపల్లి, రాంపూర్ గ్రామాల్లో గురువారం అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఆయా పథకాలకు 944 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, డీటీ నితా, ఎంఈఓ జయసింహారావు, ఎంపీఓ ప్రవీణ్, ఏపీఓ శ్రీనివాస్, ఆర్ఐలు రాణి, తిరుపతి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## మూడు రోజులు.. 16 సంస్థలు
# రూ.1,78,950 కోట్లు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

మూడు రోజులు.. 16 సంస్థలు.. రూ.1,78,950 కోట్లు ఇదీ దావోస్ పర్యటనలో ఉన్న తెలంగాణ రైజింగ్ బృందం సాధించిన పెట్టుబడుల లెక్క. అక్కడ నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రైజింగ్ బృందం గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి రికార్డు నమోదు చేసింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటి వరకు రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు సాధించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన 19 ప్రముఖ, దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న ఈ బృందం ఐటీ,ఏఐ,ఇంధన రంగాల్లో అంచనాలకు మించి భారీ పెట్టుబడులు సాధించింది. వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల పెట్టుబడుల్లో భాగంగా రాష్ట్రంలో 49,550 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ టీం దావోస్ వేదికపై అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ బృందం వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. హైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దాంతో



పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది.

☞ హైదరాబాద్ లో రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ కంపెనీ అంగీకరించింది. డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. భవిష్యత్తులో అర్టిఫిషియల్ ఆధారిత క్లౌడ్ సేవల వృద్ధికి ఈ డేటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి. తెలంగాణలో తన క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది.

☞ తెలంగాణలో సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు సుహానా మసాలా, ఎకో ఫ్యాక్టరీ ఫౌండేషన్ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో వచ్చే మూడేండ్లలో ఈ సెంటర్ ద్వారా 30వేల మంది రైతులకు శిక్షణతో పాటు సుగంధ ద్రవ్యాల నాణ్యత, వ్యవసాయ పద్ధతులను అధునికరించే నైపుణ్యాలు అందిస్తామని చెప్పారు.

☞ ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ రాష్ట్రంలో మరో కార్యాలయం ఏర్పాటుకు ముందుకువచ్చింది. దాదాపు 800 మంది ఉద్యోగులకు సదుపాయముండేలా దీన్ని నెలకొల్పుతున్నట్లు ప్రకటించింది.

☞ అత్యాధునిక సోలార్ సెల్స్,మాడ్యూల్స్ తయారీ యూనిట్ స్థాపించేందుకు మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ అక్షత్ గ్రీన్ టెక్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం రూ. 7వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చింది.

☞ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలలో ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ లుమినా.. హైదరాబాద్ లో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకువచ్చింది. రూ. 4,500 కోట్ల పెట్టుబడితో 150 మెగావాట్ల డేటా సెంటర్ ను ఏర్పాటు చేయనుంది.బ్లాక్‌స్టోన్ లూమినాతో పాటు జేసీకే ఇన్‌ఫ్రా ప్రతినిధులు ప్రభుత్వంతో ఈ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

☞ హైదరాబాద్ లో రూ.5వేల కోట్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ ముందుకువచ్చింది. ఆ కంపెనీ ఇక్కడ అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది.

☞ హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్ అభివృద్ధి చేసేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ముందుకొచ్చింది. రూ. 15,000 కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.

# హైరిస్క్ గర్భిణులపై దృష్టి సారించాలి

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :**

జిల్లాలోని హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం ఐఎంఏ భవనంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మహిళ ఆరోగ్య కార్యకర్తలకు సమీకృత అధిక ప్రమాదకర గర్భధారణ నిర్వహణ నియమాల (హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్) పైన శిక్షణ శిబిరం నిర్వహించారు. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిఓటి డాక్టర్ చరణ్ పాల్గొని మహిళ ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణను అందించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ మాతా శిశు సంరక్షణ అధికారి, డాక్టర్ జైపాల్ రెడ్డి , హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ కరదీపికలను ప్రదర్శించి కార్యకర్తలకు అందజేశారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ .. ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మెలకువలు నేర్చుకొని నైపుణ్యం పొంది మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భవతిగా ఉన్నప్పుడు వైద్యులు అందించే ఉత్తమ వైద్య సేవలే ఆరోగ్యవంతమైన శిశువుల జననంకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీ



సర్లు డాక్టర్ సమీయుద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, డిపిఓ రవీందర్, వైద్య సిబ్బంది ఏఎంఓ సత్యనారాయణ, ఆరోగ్య విద్యా బోధకులు భూమేశ్వర్, శంకర్ ,శ్రీధర్, శ్యామ్, మురళి, శ్రీనివాస్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన ఫలితాలు సాధించాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. స్థానిక సోఫి నగర్ నిర్మల్ గ్రామీణ, సోన్ కేజీబీవీ పాఠశాలలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. కూరగాయలు, ఆహారం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిరోజూ



భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు నాసిరకమైన బియ్యం, వంట నూనె, ఇతర సరుకులు సరఫరా చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో వారికి అభ్యాసం, లక్ష్యాలు, సబ్జెక్ట్ ల వారీగా పాఠాలు బోధించి సూచనలు చేశారు. విద్యార్థులు తమ పాఠాలను సమర్థవంతంగా చదవడం, సమయ పాలన పాటించడం ముఖ్యమని సూచించారు. భవిష్యత్తు లక్ష్యాలు స్పష్టంగా నిర్ణయించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. పరీక్షల సమయంలో ఆందోళన లేకుండా విశ్వాసంతో ఉండాలని ప్రోత్సహించారు. గణితం ప్రశ్నలను అడిగి విద్యార్థులతో బోర్డు పై జవాబులను చేయించారు. సబ్జెక్ట్ ల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలనీ ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీల కోఆర్డినేటర్ సలోమి కరుణ, ప్రత్యేక అధికారులు సుజాత, లతాదేవి, తహసిల్దార్ రాజు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగివుండాలని, వీటిని పాటించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యా లయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాహన చోదకులం దరికీ కంటి చూపు అత్యంత కీలకమన్నారు. రెండు రోజులపాటు చేపట్టనున్న కంటి వైద్య శిబిరంలో భాగంగా వీలైనంత ఎక్కువ మంది వాహనచోదకులకు కంటి పరీక్షలను



నిర్వహించాలన్నారు. అంతకుముందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల బారినపడి, ఇతర అనారోగ్య కారణాల వల్ల ఎంతోమంది సరైన సమయానికి రక్తం దొరకక మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిర్మల్ ను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ముర్తాజ అలీ, రానాశ్రీ, అక్షయ్, రజినీకాంత్ లు, డీఎంహెచ్ఓ రాజేందర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ కుమార్, నిర్మల్ పట్టణ తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

# మధ్యాహ్న భోజనం

**కలంజ్యోతి, మల్యాల : మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. స్టూడెంట్స్ ఇబ్బంది దృష్ట్యా కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ దాతల సహకారంతో గత మూడేళ్లుగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి మాజీ జడ్పీటీసీ దారం ఆదిరెడ్డి, దొంతరవేణి శేఖర్, నులుగోండ సురేష్, నేరెళ్ళ శ్రవణ్ సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.**






### అది తుది జాబితా కాదు..

# వెరిఫికేషన్ మాత్రమే

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. అర్హత ఉన్న చివరి లబ్ధిదారుడి వరకు రేషన్ కార్డులు అందజేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన లిస్టు తుది జాబితా కాదన్నారు. కేవలం వెరిఫికేషన్ కోసం మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుల పరిశీలన ఐదేళ్ల పాటు జరుగుతుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలో వెలుగుచూస్తున్న నిరసనలు.. ఆందోళనపై మంత్రి స్పందించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు వివరించాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని, అర్హులందరికీ అందే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి ప్రకటించారు. సామాజిక ఆర్థిక సర్వే, ప్రజా పాలన దరఖాస్తులు, కులగణన, అలాగే గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 40వేల రేషన్ కార్డులు మాత్రమే జారీ చేస్తే.. తమ ప్రభుత్వం లక్షల్లో కార్డులు ఇవ్వబోతుందని చెప్పారు. కృష్ణా జలాల విషయంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందనీ మన హక్కుల్ని ఇతరులకు అప్పగించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



### మోసపూరిత హామీలతో

# మభ్యపెడుతున్న కాంగ్రెస్

## మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

**కలంజ్యోతి, జగిత్యాల :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామంలోని భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలు సంవత్సరమైనా కూడా ఏ ఒక్కటి నెరవేరలేదని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉండాలని, కార్యకర్తలకు ఎలాంటి ఆపద ఉన్న మీకు మేము , పార్టీ అండగా ఉంటుందన్నారు. నమ్మి ప్రజలు ఎమ్మెల్యేకు ఓటు వేస్తే అవకాశం కోసం పార్ మారాడని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎవరు నిరుత్సాహ పడకుండా, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతై కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్ రావు,గంగారెడ్డి, తోట మహేష్ , లింగన్న, శ్రీను, దేవి రాజలింగం, ప్రమోద్, తోట జగన్, శ్రీనివాస్ తిరుపతి, నరేష్, గ్రామ మహిళ అధ్యక్షురాలు జుంబర్తి శాంత, యూత్ నాయకులు బలు, రాము, జలంధర్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.




## గూడులేని వారికి ఇల్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఆందోళన చెందొద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. రైతు భరోసా పథకం ద్వారా రూ.12 వేలు అందజేస్తామన్నీరు. ఎన్నికల్లో మాట ఇచ్చినట్టు రూ.2 లక్షల వరకు రుణమాఫీని రూ.22,000 కోట్లతో చేశామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీకి ప్రతినెల 300 కోట్లు కడుతున్నట్లు తెలిపారు. గ్యాస్ సిలిండర్ రూ.500కి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య శ్రీనివాస్, పెండెం రామానంద్, మండల పార్టీ అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల:** అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని 17, 18, 22, 23, 24, 38 వార్డులలో టియుఎఫ్ఐడిసి నిధులు రూ.1 కోటి 3లక్షలతో ఆయా వార్డులలో అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. ప్రభుత్వం ఈ నెల 26 నుండి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన అర్హులను గుర్తించేందుకు పట్టణాల్లో వార్డు సభలు, గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మా ట్లాడుతూ.. రాష్ట్ర పథకాలు ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, గ్రామ సభలలో లబ్ధిదారులు జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళనకు గురి కావలిసిన అవసరం లేదని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరినాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ లు పద్మ సింగరావు, చుక్క నవీన్, పులి రమ, జుంబర్తి రాజ్ కుమార్, గుర్రం రాము, దాసరి లావణ్య ప్రవీణ్, ఏఈ అనిల్, నాయకులు వీర బత్తిని శ్రీనివాస్, ప్రభాత్ సింగ్ ఠాగూర్, పోతునుక మహేష్, దుమాల రాజ్ కుమార్, నాయకులు, వార్డు ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి సాగుకు దేవాదుల నీరు విడుదల

**కలంజ్యోతి, నల్లబెల్లి :** దేవాదుల పైప్ లైన్ ద్వారా మేడపల్లి, మామిల్ల చెరువు రైతులకు యాసంగి పంటకు సుమారు 1000 ఎకరాల ఆయకట్టుకు అధికారులకు దేవాదుల పైపుల లైన్ గురువారం నీటిని విడుదల చేశారు. సాగుకు నీటిని విడుదల చేయాలని ఆదేశించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెగా కంపెనీ ఇంజనీర్లు ఆదినారాయణ, అనిల్, శివకుమార్, ఏఈ లు, డీఈలు, గోవిందా పూర్ మాజీ ఎంపిటిసి జిల్లా మునిందర్, మేడపల్లి మాజీ ఎంపీటీసీ అంజలి మోహన్, రాంపూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు, నార్కపేట గుండ్ల పహాడ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.




## బేటి బచావో - బేటి పడావో దశాబ్ది ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**కలంజ్యోతి, నిర్మల్ :** బేటీ బచావో బేటి పడావో దశాబ్ది వేడుకల పోస్టర్లను అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ, మహిళా సాధికారత కేంద్రం (మిషన్ శక్తి) బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో భాగంగా 22న ప్రారంభమైన వేడుకలు మార్చి 8వ తేదీ వరకు 45 రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ఆడ పిల్లల ప్రాముఖ్యత తెలియజేస్తూ ఆడపిల్ల పేరు మీదుగా మొక్కలు నాటించాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పిస్తూ లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు ను ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాలలు కళాశాలలు మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్, డిఆర్డిఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డఫోడిల్స్‌లో వార్షిక క్రీడా పోటీలు

### విద్యార్థులు క్రీడా రంగాల్లో రాణించాలి

### డఫోడిల్స్ (సీబీఎస్ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్




**కలంజ్యోతి, నర్సంపేట :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో రాణించాలని డఫోడిల్స్ (సీబీఎస్ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్ అన్నారు. గురువారం నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సీబీఎస్ ఈ పాఠశాలలో 202425 వార్షిక క్రీడా పోటీలను నరేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి జెండాను ఎగురవేసి ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆయన మాట్లాడుతూ.. క్రీడలు దేహ దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని తెలిపారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువులు చదివేందుకు క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థుల అద్భుత ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమం లో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్ , ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ రీటా,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.





## ఖేలో భారత్ క్రీడోత్సవాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**కలంజ్యోతి, నిర్మల్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో భారత్ క్రీడోత్సవాలను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ గురువారంనిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలు విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా వారిలో శారీరక దృఢత్వాన్ని ఏర్పరుస్తాయని, తద్వారా విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి కలుగుతుందని అన్నారు. ఏబీవీపీ విద్యార్థుల్లో దేశభక్తితో పాటు సమాజం పట్ల బాధ్యతను నేర్పిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి క్రీడలు మరిన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.





# నేతాజీ ధైర్య సాహసాలు ఎనలేనివి

### ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

**న్యూఢిల్లీ:** భారతదేశ వారసత్వాన్ని కాపాడేందుకు సుభాష్ చంద్రబోస్ ధైర్య సాహసాలు ఎనలేనివని, నేటి యువతకు స్ఫూర్తిదాయకం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం నేతాజీ 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపనతో ఆయన ఎంతోమందిలో ఆత్మన్యూన తను పక్కకు నెట్టి ఎలాంటి పరిస్థితులైనా ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే విధానాన్ని నేర్పిన మహనీయుడన్నారు. భారతదేశ నిర్మాణంలో ఆయన అనుసరించిన విధానం తమకు స్ఫూర్తినిస్తుందని ప్రధాని తెలిపారు.

**బాలాసాహెబ్ థాకరేకు నివాళులు..**

ప్రజా సంక్షేమం, జాతీయవాదం, భారతీయ సంస్కృతికి శివసేన వ్యవస్థాపకుడు బాలా సాహెబ్ థాకరే చేసిన సేవలు మరువలేనివని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం థాకరే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహారాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి నిబద్ధతతో పనిచేశారని అన్నారు. థాకరే సైద్ధాంతిక దృఢత్వం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని మోదీ అన్నారు.




### నర్సంపేటలో..

**కలంజ్యోతి, నర్సంపేట :** సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ భారతదేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్య పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ అన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్, నర్సంపేట ఉపాధ్యక్షులు రాగూర్ విజయ్ సింగ్, కార్యదర్శి పొనుగోటి రవీంద్రచారి, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు కుంకీసా విగ్నేష్, చిలువేరు అన్వేష్, నాయకులు కాసుల నాగేంద్రబాబు, సామల ప్రవీణ్ కుమార్, తప్పేట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### మల్యాలలో..

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలం ముత్యంపేటలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ (పరాక్రమ్ దివస్) జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు దారం ఆదిరెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మ్యాక లక్ష్మణ్, దొంతరవేణి శేఖర్, గుండేటి రవితేజ, నేతాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.





### జగిత్యాలలో

**కలంజ్యోతి, జగిత్యాల :** జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పరాక్రమ దివస్, సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భూమేష్, షి టీం కానిస్టేబుల్ సౌజన్య, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రమోద పాల్గొని సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై, వారి స్వాతంత్ర పోరాటంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానంలో సయ్యద్ ఫలక్.బి. అంజలి,వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి హర్షిని, ద్వితీయ బహుమతి పి.అంజలి,తృతీయ బహుమతిని నివేదిత గెలుపొందారు.ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటరీ మారం గణేశ్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సంగీత రాణి,శ్రీలత,అధ్యాపకులు నీరజ,సునీత, రామచంద్రం, వర్రప్రసాద్ పాల్గొన్నారు.

## దుబాయ్‌లో మల్యాల యువకుడు ఆత్మహత్య



**కలంజ్యోతి, మల్యాల :** దుబాయ్ లో మల్యాల మండల కేంద్రం చెందిన భోగ సాయి (25) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు... సాయి తండ్రి గంగాధర్ నాలుగేళ్ల క్రితం, తల్లి శారద ఏడాది క్రితం మృతి చెందారు. ఇద్దరు సిస్టర్స్ ఉండగా, వారికి పెళ్లిళ్లు కావడంతో సాయి ఒంటరి వాడయ్యాడు. అయితే మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన సాయి తల్లి మరణం ముందు వివాహం కోసం స్వగ్రామం వచ్చాడు. అనారోగ్యంతో తల్లి మరణించగా, వివాహం కాలేదు. దీంతో నాలుగు నెలల క్రితం మళ్ళీ దుబాయ్ వెళ్ళాడు. దుబాయ్ లోని అల్కూస్ 1 ప్రాంతంలో ఉంటున్న సాయి రెండు రోజులుగా తన రూమ్ కి రాకపోవడంతో అక్కడి వాళ్ళు గాలించారు. తన క్యాంప్ సమీపంలోని జనసంచారం ఎక్కువ లేని ప్రాంతంలో గల హోల్డింగ్ టవర్కు సాయి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉండడం గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సాయి డెడ్ బాడీని తొందరగా స్వగ్రామం రప్పించాలని బంధువులు కోరుతున్నారు.

## లబ్ధిదారుల ఎంపిక లో జోక్యం చేసుకోను

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కలంజ్యోతి, హుస్నాబాద్ :** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మంత్రిగా తమ జోక్యం ఉండదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగూణంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు మంజూరు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇంకా రెండు లక్షలకు పైగా మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. వారికి మార్చిలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 15వ వార్డులో వార్డుసభను మంత్రి సందర్శించారు.